కేసీఆర్‌పై కక్ష సాధింపెందుకు..?

- కాళేశ్వరంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తప్పా
- జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

పొత్తూరులో మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

ఇల్లంతకుంట, మే 21: 'తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వానికి కక్ష సాధింపు ఎందుకు..? వృథాగా పోతున్న గోదారి జలాలను ఒడిసిపట్టినందుకా..? కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసినందుకా..?' చెప్పాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ప్రశ్నించారు. బుధవారం పొత్తూరు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చిందని, ఆరు గ్యారెంటీలంటూ అబద్ధాలతో మభ్యపెట్టిందని మండిపడ్డారు. హామీల అమలు విషయంలో ప్రజల తిరుగుబాటును తట్టుకోలేక, వారి దృష్టిని మరల్చేందుకే బీఆర్ఎస్ నాయకులపై నిందలు వేస్తూ కాంగ్రెస్ నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని ధ్వజమెత్తారు. నాడు కరువుతో ప్రజలు వలస పోతుంటే కేసీఆర్ చూడలేకపోయారని, కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసి వలసలు వాపస్ చేయించారని కొనియాడారు. బీఆర్ఎస్ పాలనలో ఎటు చూసినా పచ్చని పంట పొలాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కానీ రేవంత్‌రెడ్డి చేతగాని తనంతో మళ్లీ ఎడారిగా మారుతున్నదని దుయ్యబట్టారు. కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు కక్షసాధింపులు మాని రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండేలా చూడాలని, లేదంటే పాలన చేతగాదని చెప్పి దిగిపోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కదురు శేఖర్, గుంటి మధు, సిద్ధం సాగర్, బండారి మహేశ్, కోల రాజు ఉన్నారు.

వెంకటాపూర్ కొనుగోలు కేంద్రంలో తనిఖీ

- 'నమస్తే' కథనానికి స్పందన

వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట, మే 21: వెంకటాపూర్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. అదనపు తూకంపై రైతుల అభ్యంతరాలు చేస్తున్న తీరుపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో స్పందించిన అధికారులు, ఏపీఎం మల్లేశంతో కలిసి బుధవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. తూర్పార బట్టేందుకు జాలీలు ఎందుకు ఇవ్వలేదని, ప్రభుత్వ నిబంధనలను ఎందుకు అనుసరించలేక పోయారని నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బస్తాకు 42 కిలోలతో పాటు అదనంగా 300 గ్రాములు కోత పెడుతున్నారని రైతులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ట్రక్‌షీట్ వివరాలు తీసుకుని కొనుగోలు తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కచ్చితంగా తూర్పార బట్టేందుకు రైతులకు జాలీలు అందుబాటులో ఉంచాలని, ఒకవేల ధాన్యం పట్టకుండా అదనపు తూకానికి రైతులు ఒప్పుకుంటే వారితో తీర్మానం రాయించుకోవాలని సూచించినట్లు ఓ అధికారి తెలిపారు.

నూతన దంపతులకు 'కేటీఆర్ జ్ఞాపిక'

చీర్లవంచలో బీఆర్ఎస్ సీనియర్ నేత వేల్పుల నర్సయ్య కూతురు వివాహానికి హాజరై కేటీఆర్ పంపిన జ్ఞాపికను అందిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న, నేతలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొత్త కార్యక్రమం
- కార్యకర్తలు, నేతల ఇండ్లలో వివాహాలకు వధూవరుల ఫొటోలతో మెమొంటో
- ఈ పెండ్లిళ్ల సీజన్ నుంచే శ్రీకారం
- కుటుంబాల్లో హర్షం

సిరిసిల్ల రూరల్, మే 21: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు మరింత చేరువయ్యేందుకు వారి కుటుంబాల్లో వివాహాలకు వధూవరుల ఫొటోలతో జ్ఞాపికను పంపిస్తున్నారు. ఈ పెండ్లిళ్ల సీజన్ నుంచే మెమొంటోలు అందజేస్తుండగా, ఆయా కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

> 'మూడుముల్ల బంధంతో కొత్త జీవితంలోకి అడుగుపెట్టిన మీ జంట పిల్లాపాపలు, అష్టయిశ్వర్యాలతో కలకాలం వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ.. నూతన దంపతులకు నా హృదయపూర్వక వివాహ మహోత్సవ శుభాకాంక్షలు'
>
> - మీ కేటీఆర్

ఈ సీజన్ నుంచే ప్రారంభం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, నాయకులతో తనదైన శైలిలో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రజా సమస్యలపై రాష్ట్ర మంతటా గళమెత్తుతూ, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్న ఆయన, అనివార్య కారణాలతో పార్టీ కార్యకర్తలు, పార్టీ నేతల ఇండ్లలో వివాహాలకు హాజరు కాకపోవడం వెలితిగా భావిస్తున్నారు. ఈ క్రమంలో వారిని చేరేందుకు, ఆశీర్వాదం అందించేందుకు, శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కార్యకర్తలు, పార్టీ నేతల ఇండ్లలో వివాహాలకు నూతన దంపతుల ఫొటోలతో కూడిన జ్ఞాపికను తయారు చేయించి, పార్టీ నేతల ద్వారా వివాహం రోజున అందించి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నేత వేల్పుల నర్సయ్య కూతురు వివాహం జరిగింది. ఈ క్రమంలో నర్సయ్య కూతురు-అల్లుడు ఫొటోతో మెమొంటో తయారు చేసి పంపించగా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న వివాహానికి హాజరై అందించారు. కేటీఆర్ పంపిన జ్ఞాపిక అందుకోవడంతో దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నేత రంగు ప్రసాద్ కుమారుడు వివాహానికి, జిల్లెల్లలో మాట్ల మధు సోదరుడు వివాహానికి జ్ఞాపికలను పంపించగా,అందించామని పార్టీ మండలాధ్యక్షుడు రాజన్న తెలిపారు. సిరిసిల్ల నియోజవర్గంలోని సిరిసిల్ల పట్టణం, తంగళ్లపల్లి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్‌లోని పార్టీ నేతలు, కార్యకర్తలతోపాటు వారి ఇండ్లలో వివాహాలకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముస్తాబాద్‌లో కొత్త జంటకు కానుక

కేటీఆర్ పంపిన గిఫ్ట్‌ను అందజేస్తున్న కేడీసీసీబీ అధ్యక్షుడు కొండూరి, నాయకులు

ముస్తాబాద్, మే 21: మండల కేంద్రంలో బుధవారం జరిగిన కొంక రాము - తీక్షణ వివాహానికి కేడీసీసీబీ అధ్యక్షుడు కొండూరి, బీఆర్ఎస్ జిల్లా అధక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పంపిన జ్ఞాపికను వారికి అందించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు, ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ కో ఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా, మాజీ పట్టణ అధ్యక్షుడు గూడూరి భరత్, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శీలం స్వామి, నాయకులు తాళ్ల రాజు, ముక్క మల్లయ్య, బండి ఎల్లం, శ్రీనివాస్ రెడ్డి, రమేశ్, పార్టీ సోషల్ మీడియా వెంకటేష్, శేఖర్ ఉన్నారు.

వివాహ వేడుకలో కేటీఆర్

వినయ్-నర్మతను ఆశీర్వదిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్ల టౌన్, మే 21: హైదరాబాద్‌లోని తులిప్స్ గ్రాండ్ హాల్‌లో బుధవారం జరిగిన సిరిసిల్ల సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ-అరుణ దంపతుల కుమారుడి వివాహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ హాజరయ్యారు. నూతన వధూవరులు వినయ్-నర్మతను ఆశీర్వదించారు. వారి వెంట కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు ఉన్నారు.

రామన్నపేటలో 'చల్మెడ'

రామన్నపేటలో తిప్పని రాములు-లింగవ్వ కూతురు వివాహానికి బీఆర్ఎస్ వేముల వాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ సర్పంచ్ దమ్మ అంజయ్య, నాయకులు బైరగొని రమేశ్, కమలాకర్, నగేష్, అజయ్ ఏరెడ్డి రాజిరెడ్డి ఉన్నారు. - చందుర్తి, మే 21

అర్జీలను ఆన్‌లైన్ చేయాలి

- సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఐఏఎస్ మకరంద్

రుద్రంగిలో మాట్లాడుతున్న ఐఏఎస్ మకరంద్

రుద్రంగి, మే 21: భూ భారతి రెవెన్యూ చట్టంలో భాగంగా సమస్యల పరిష్కారానికి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఎ) ప్రాజెక్టు డైరెక్టర్ ఐఏఎస్ మకరంద్ సూచించారు. బుధవారం రుద్రంగిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్జీల పరిష్కార విధానాన్ని పరిశీలించారు. అంతకుముందు రుద్రంగికి వచ్చిన ఆయనకు రెవెన్యూ అధికారులు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశమై, భూ భారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన ఆర్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ తహసీల్దార్ పుష్పలత, పైలెట్ ప్రాజెక్టు ఇన్‌చార్జిలు భూపతి, షరీఫ్, డీటి మనోహర్, ఆర్ఐ శ్యామ్ పాల్గొన్నారు.

ఐదు తరాల ఆత్మీయ సమ్మేళనం

- రుద్రవరంలో తునికి కుటుంబసభ్యుల ప్రత్యేకత

రుద్రవరం గ్రామంలోని తనికి రాజయ్యకు చెందిన ఐదు తరాల కుటుంబసభ్యులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మధ్యమానేరు జలాశయం నిర్మాణంతో నిర్వాసితులుగా మారిన వీరు సిద్దిపేట, హైదరాబాద్, తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. దాదాపు 80 మంది ఒకే చోట చేరి యోగక్షేమాలు చెప్పుకొని సంతోషంగా గడిపారు.
- వేములవాడ రూరల్, మే 21

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

వర్షం.. నష్టం

- కేంద్రాల్లోనే తడిసిన ధాన్యం

వేములవాడ/ చందుర్తి/రుద్రంగి/ కోనరావుపేట, మే 21: అకాల వర్షం.. రైతన్నకు అపార నష్టాన్ని తెచ్చింది. జిల్లాలో బుధవారం కురిసిన వాన కండగండ్లే మిగిల్చింది. చందుర్తి మండలంలో ఈదురు, గాలులతో కూడిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది. కోనరావుపేట మండలం నిజామాబాద్ మార్కెట్‌లో ధాన్యం నీటిలో తడిసిపోగా రైతులు వడ్లను బయటకు ఎత్తిపోశారు. తాను సెంటర్‌లో ధాన్యం పోసి నెల పదిహేను రోజులైనా కాంటా పెట్టకపోవడంతో తడిసిపోయిందని చాంద్‌నగర్‌కు చెందిన బడే బేగం ఆవేదన వ్యక్తం చేశారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు మిల్లులకు తరలించకపోవడంతో తడిసిపోయాయి. రుద్రంగి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసి మిల్లులకు తరలించకపోవడంతో బస్తాలు తడిసిపోయాయి. ఇల్లంతకుంట మండలం వంతడుపుల శివారులోని కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన బస్తాలు తడిసిపోయాయి.

పంట మార్పిడితో అధిక లాభాలు

బోయినపల్లిరూరల్, మే21: పంట మార్పిడితో అధిక లాభాలు రైతులు పొందవచ్చునని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ మధుమోహన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానకాలం రైతులు భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని, సేద్యంలో సేంద్రియ ఎరువులు వినియోగిస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వేములవాడ డివిజన్ వ్యవసాయ సంచాలకులు రామరావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, మండల పశువైద్యాధికారి సతీష్, వ్యవసాయాధికారి శ్రీధేవి, లక్ష్మణ్, విద్యార్థులు, ఉత్తమ రైతులు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన సెస్ డైరెక్టర్లు

కేటీఆర్‌తో సెస్ డైరెక్టర్లు

ముస్తాబాద్, మే 21: హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌ను సిరిసిల్ల సెస్ డైరెక్టర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా మండలాల పరిధిలో జరుగుతున్న సెస్ సంస్థ అభివృద్ధిపై వివరించినట్లు ముస్తాబాద్ సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి తెలిపారు. కలిసిన వారిలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, సిరిసిల్ల టౌన్ 1 డైరెక్టర్ దిడ్డి రమాదేవి శ్రీనివాస్, వీర్నపల్లి సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం యాదవ్ ఉన్నారు.

30 రోజుల్లో నిర్మాణం ప్రారంభించాలి

సిరిసిల్లరూరల్: లబ్ధిదారుకు ఇల్లు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, తదితరులు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల అందజేత

సిరిసిల్ల రూరల్, మే 21: ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు 30రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం తంగళ్లపల్లిలో రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి, మాట్లాడారు. లబ్ధిదారులకు నాలుగు దశల్లో రూ.5లక్షల ఆర్థిక సహాయం అందుతుందని, బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష, గోడలు నిర్మిస్తే రూ.లక్ష, స్లాబ్ నిర్మించిన తర్వాత రూ.2లక్షలు, ఇంటినిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ఇంటినిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని, మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. మంజూరైన తర్వాత నుంచి 30రోజుల్లో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించకపోతే ఇల్లు రద్దయే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో హౌజింగ్ పీడీ శంకర్,మండల ప్రత్యేక అధికారి శేషాద్రి, ఏఎంసీ చైర్ పర్సన్ స్వరూపరెడ్డి, వైస్ చైర్మన్ నేరేల్ల నర్సింగం గౌడ్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, సిబ్బంది, లబ్ధిదారులు ఉన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

ఎల్లారెడ్డిపేట, మే 21: ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయముండని, పారదర్శకంగా మంజూరు చేసినట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. బుధవారం ఎల్లారెడ్డిపేటలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మండలంలో 643 ఇండ్లను మంజూరు చేశామని, ఒక్కో లబ్ధిదారుడికి నాలుగు దఫాల్లో నగదును చెల్లించే ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి అప్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సత్తయ్య, ఏఎంసీ చైర్మన్ సాబెరా బేగం, సెస్ డైరెక్టర్ వర్స కృష్ణహరి, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ఉన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన దారుణం

- అధికారుల తీరు సరికాదు
- సెస్ డైరెక్టర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి

ఎల్లారెడ్డిపేటలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 21: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ వేదికపై ప్రొటోకాల్ ఉల్లంఘన దారుణమని, ఫ్లెక్సీలో కేటీఆర్ ఫొటో విస్మరించడంలో అధికారుల తీరు అభ్యంతరకరంగా ఉందని సెస్‌డెరెక్టర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమెరుగని నేత, సిరిసిల్ల అభివృద్ధి ప్రదాత కేటీఆర్‌ను తక్కువ చేసి చూసే ఆలోచనను మానుకోవాలని హెచ్చరించారు. తమకు ప్రొటోకాల్ ఉన్నా వేదికపై మాట్లాడనివ్వకుండా ఏ పదవి లేని నాయకులతో మాట్లాడించడం దారుణమని దుయ్యబట్టారు. భవిష్యత్తులో ప్రొటోకాల్ విస్మరిస్తే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కు నోబెల్ పురస్కారమివ్వాలని సీనియర్ ఐఏఎస్ అధికారులు ప్రశంసించిన విషయాన్ని మరిచి, ప్రాజెక్టు విషయంలో ఆయనకు నోటీసులు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు నిలదీస్తున్నారని, వారి ఆలోచనను డైవర్ట్ చేసేందుకు కొత్త నాటకానికి కాంగ్రెస్ నాయకులు తెరలేపుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయమన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎడ్ల సందీప్, నాయకులు మురళీమోహన్, నమిలికొండ శ్రీనివాస్, పిల్లి కిషన్, దూస శ్రీనివాస్, జబ్బార్, పూణ్యా, సీత్యా, సుధాకర్‌రావు, పిల్లి కిషన్, హసన్, ఎన్‌వీఎన్. రెడ్డి, నర్సింలు, రాము, శ్రీకాంత్, సురేశ్, అనిల్, బంటి, నరేందర్, శరత్ ఉన్నారు.

జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

సిరిసిల్ల రూరల్, మే 21: అకాల వర్షాలతో వైరల్ జ్వరాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత సూచించారు. బుధవారం ఓబులాపూర్‌లోని ఆరోగ్య ఉపకేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాల రికార్డులు, వ్యాక్సిన్ కోల్డ్ చైన్‌ను పరిశీలించారు. సకాలంలో గర్భిణులు, ఐదేండ్లలోపు చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు అందించాలని సూచించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ ఆఫిసా తదితరులు ఉన్నారు.

తాటి చెట్టుపై నుంచి పడి..

- కొండాపూర్‌లో గీత కార్మికుడు మృతి

బలరాం (ఫైల్)

ముస్తాబాద్, మే 21: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన కొండాపూర్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దూరి బలరాం గౌడ్ (50) గీత కార్మికుడు. రోజూవారీలాగే మంగళవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు పైకి ఎక్కాడు. అడ్డుగా ఉన్న తాటి కమ్మలు కొట్టే క్రమంలో మోకు జారి కిందపడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే సాయంత్రం వెళ్లిన బలరాం గౌడ్ రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి వెతికారు. ఆచూకీ దొరక్కపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బుధవారం ఉదయం తాటి చెట్టు పరిసరాల్లో చూడగా చెట్టు పొదల్లో మృతి చెంది ఉన్నాడు. బలరాంగౌడ్‌కు భార్య పద్మ, ముగ్గురు కొడుకులు. ఇంటిపెద్ద దిక్కును కోల్పోయిన బలరాం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు.

గుడి చెరువులో రెండు గుర్తుతెలియని మృతదేహాలు

వేములవాడ, మే 21: వేములవాడ పట్టణంలోని గుడి చెరువు నుంచి బుధవారం రెండు గుర్తుతెలియని పురుష మృతదేహాలు వెలికితీసినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించామని, రెండు వేరు వేరు ప్రాంతాల్లో మృతదేహాలు తేలి ఉన్నట్లుగా చెప్పారు. ఒకరి వయస్సు 55 నుంచి 60 ఏండ్ల మధ్యలో ఉంటుందని, మరొకరి వయస్సు 35 నుచి 40 ఏండ్లలోపు ఉంటుందని వివరించారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లుగా అనుమానిస్తూ దర్యాప్తు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. రెండు మృతదేహాలను గురువారం సాయంత్రం వరకు వేములవాడ ఏరియా దవాఖానలోని మార్చురీలో ఉంచుతున్నామని, ఎవరైనా అనుమానం ఉన్నవారు, తప్పిపోయిన వారి కోసం వెతికేవారు ఉంటే చూసి నిర్ధారించాల్సిందిగా కోరారు.

పుస్తె మట్టెల వితరణ

గంభీరావుపేట, మే 21: నాగంపేటకు చెందిన మద్దుల రాజు కూతురు మానసరెడ్డి వివాహానికి బుధవారం కరీంనగర్ మిల్క్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తె మట్టెలను అందించారు. ఇక్కడ డెయిరీ చైర్మన్ మద్దుల మల్లారెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చందుర్తి ఠాణాకు రాష్ట్రంలోనే రెండోస్థానం

- కేసుల దర్యాప్తులో ఉత్తమ ప్రతిభ

ప్రశంస పత్రం అందుకుంటున్న ఎస్ఐ

తెలంగాణ చౌక్/చందుర్తి, మే 21: కేసుల దర్యాప్తు, బాధితులకు సత్వర న్యాయం అందించడంలో చందుర్తి ఠాణాకు రాష్ట్రంలోనే రెండోస్థానం దక్కింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డీజీపీ జితేందర్ చేతులమీదుగా ఎస్ఐ అంజయ్య ప్రశంస పత్రం అందుకున్నారు. కాగా, చందుర్తి ఠాణాకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చేందుకు కృషి చేసిన అధికారులతోపాటు ఏఎస్పీ శేషాద్రినీరెడ్డి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అంజయ్య, సిబ్బందిని ఎస్పీ మహేశ్ బి గితే అభినందించారు.